
**కళాశాలలో వసతులు కరువు**




**కామారెడ్డిలో కత్తిపోట్ల కలకలం**



AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## ఘనంగా లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు




**అక్షరటుడే ఆర్మూర్:** ఆర్మూర్ మండలం మగ్గిడిలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం, సాయంత్రం కుంకుమార్చన, డోలోత్సవం, ఊయలసేవ నిర్వహించారు. గుర వారం స్వామి కళ్యాణం, రథోత్సవం, అన్నదానం నిర్వహించనున్నట్లు గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



## రూ.1.85 కోట్ల అప్పు చేసి..

**■ కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వ్యాపారి**



**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలో ఓ వ్యాపారి కుటుంబంతో సహా కనిపించకుండా పోయాడు. రూ.1.85 కోట్ల అప్పు చేసిన ఆయన ఇంటి గోడకు లేఖ అతికించి మరీ వెళ్లిపోవడం గమనార్హం. దీంతో సదరు వ్యాపారికి అప్పు ఇచ్చిన వారు ఆందోళనకు గురవుతున్నారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి రాం మందిర్ రోడ్డులో సూపర్ మార్కెట్ నిర్వహిస్తుంటాడు. అతనికి వ్యాపారంలో రూ.కోటి 85 లక్షల అప్పులయ్యాయి. అందులో తనకు ఉన్న సూపర్ మార్కెట్‌కు వివిధ ఏజెన్సీల నుంచి తీసుకువచ్చిన సామగ్రికి సంబంధించిన అప్పుతో పాటు, బ్యాంక్ లోన్, మరొక వ్యాపారి వద్ద తీసుకున్న అప్పు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి ఎక్కువ కావడంతో పట్టణం విడిచి వెళ్లిపోయాడు. తనకు ఓ వ్యాపారి నుంచి ప్రాణహాని ఉందని లేఖ రాసి మరీ వెళ్లడం పట్టణంలో తీవ్ర చర్చకు దారి తీసింది. కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు, సెక్రెటరీకి సదరు వ్యాపారి లేఖ రాసి, ఇంటి గోడకు అతికించాడు. బ్యాంకు, ఇతర వ్యక్తులు, ఏజెన్సీతో సహా మరొక రైస్ మిల్ వ్యాపారి వద్ద అప్పులు ఉన్నాయని లేఖలో పేర్కొన్నాడు. రైస్ మిల్ వ్యాపారి తన కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేస్తున్నాడని, అతని నుంచి ప్రాణహాని ఉందని ఆరోపించాడు. అందుకే కామారెడ్డి వదిలి వెళ్లిపోతున్నామని తెలిపాడు. ఆస్తులు అమ్మి అందరి అప్పులు సెటిల్ చేస్తానని లేఖలో పేర్కొన్నారు. తన ప్రాపర్టీ కొనడానికి ఓ వ్యక్తి ముందుకు వచ్చాడని, డబ్బులు రావడానికి సమయం పడుతుందని రాశాడు. డబ్బులు రాగానే అప్పులు తీర్చేస్తానని పేర్కొన్నారు. తనకు కొంత సమయం ఇవ్వాలని, అప్పులన్నీ తీర్చేసి మళ్లీ కామారెడ్డిలో వ్యాపారం కొనసాగిస్తానని లేఖలో వెల్లడించారు. ఈ ఘటన కామారెడ్డిలో కలకలం రేపింది.




కామారెడ్డి మున్సిపల్ స్థలాలు పదిలంగానే ఉన్నాయా అనే ప్రశ్నలు నెలకొన్నాయి. బల్దియా పరిధిలోని పలు స్థలాలను కొందరు ఆక్రమించుకున్నారు. పట్టణంలోని సర్వే నంబర్ 6లో అక్రమ కట్టడాలను అధికారులు ఇటీవల కూల్చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాంతో అసలు మున్సిపల్ స్థలాలు ఎన్ని ఉన్నాయి.. ఎక్కడెక్కడ ఉన్నాయనే చర్చ సాగుతోంది. అసలు మున్సిపల్ భూములు ఉన్నాయా.. కబ్జా చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**- అక్షరటుడే, కామారెడ్డి**

# మున్సిపల్ స్థలాలు పదిలమేనా!

■ కబ్జాలకు గురవుతున్న భూములు ■ సర్వే నంబర్ 6 ఆక్రమణల తొలగింపుతో చర్చ ■ బడా నాయకుల కబ్జాలపై చర్యలు కరువు

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో దాదాపు వందకు పైగా మున్సిపల్ స్థలాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. అయితే ఆ స్థలాలు మున్సిపల్ ఆధీనంలోనే ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీకి సంబంధించిన అనేక స్థలాలు పరాధీనం అయ్యాయనే చర్చ సాగుతోంది. అసలు అధికారులకు స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయి అనేది తెలియదని ప్రచారం సాగుతోంది. కొన్ని స్థలాల్లో మాత్రం పార్కులు, షాపింగ్ కాంప్లెక్సులు, ప్రకృతి వనాలు నిర్మించారని తెలుస్తోంది.

### వీక్లీ మార్కెట్ స్థలం స్వాధీనంతో చర్చ

కామారెడ్డి పట్టణంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో సర్వే నంబర్ 6 కబ్జా విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ స్థలంపై అధికారులు, కబ్జాలో ఉన్న వారు కోర్టుకు వెళ్లారు. ఆ స్థలం మున్సిపాలిటిదేనని న్యాయస్థానం తీర్పు చెప్పింది. దీంతో సుమారు ఏడాది తర్వాత రెవెన్యూ, పోలీస్ శాఖ సహకారంతో అక్రమ కట్టడాలు కూల్చేసిన మున్సిపల్ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే సర్వే నంబర్ 6 స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవడంతో పట్టణంలో మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాల అంశం తెరపైకి వచ్చింది. పలు చోట్ల బడా బాబులు, రాజకీయ నాయకులు స్థలాలు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సామాన్యుల నుంచి స్థలం స్వాధీనం చేసుకున్న అధికారులు నేతల ఆక్రమణలపై సైతం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### లెక్కలు తీసి ఫెన్సింగ్ వేస్తాం



మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలు మున్సిపల్ ఆధీనంలోనే ఉన్నాయి. ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయనేది లెక్కలు తీస్తాం. ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ వేస్తాం. కబ్జాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

**– రాజేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్**

## రూ.17లక్షల విలువైన ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి తిరిగి బాధితులకు అందించినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ డివిజన్‌లో కొన్ని రోజుల క్రితం పోగొట్టుకున్న, చోరీ చేయబడిన రూ.17 లక్షల విలువైన 170 ఫోన్లను ఇతర రాష్ట్రాల నుంచి సైతం రికవరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే చిన్న లావాదేవీ కూడా జరగట్లేదని.. అలాంటిది విలువైన సమాచారం ఉన్న ఫోన్లతో అజాగ్రత్తగా ఉండవద్దని బాధితులకు ఏసీపీ హితవు పలికారు. బ్యాంక్ అకౌంట్స్, పాస్‌వర్డ్స్ వంటివి మొబైల్‌లో సేవ్ చేసి పెట్టుకుంటారని.. వీటిని పసిగట్టిన నేరగాళ్లు బ్యాంక్ అకౌంట్లను ఖాళీ చేసేస్తారని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నా, చోరీ జరిగిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో https://www.ceir.gov.in లో ఫిర్యాదు చేయాలని, లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.



## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక అధికారి

**అక్షరటుడే, బాన్సువాడ :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల అధికారులు జిల్లాలో పర్యటిస్తున్నారు. నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక అధికారి సత్యనారాయణ రెడ్డి బాన్సువాడ మండలంలోని కోనాపూర్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది నియామకాలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు, అభ్యర్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్ దాఖలు చేసేలా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

## నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు స్వీకరించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు స్వీకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. తాడ్వాయి మండలంలోని కన్కల్ గ్రామ పంచాయతీలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ప్రతి నామినేషన్ పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రెండో విడత నామినేషన్ల పరిశీలన, విత్‌డ్రా ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా మూడో విడత నామినేషన్‌లో చివరిరోజు ఎక్కువగా నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుందని దానికి సిద్ధంగా ఉండాలన్నారు. కామారెడ్డిలో మొదటిదశ నామినేషన్ ప్రక్రియ నవంబర్ 27న ప్రారంభమై నవంబర్ 29వ తేదీన ముగుస్తుందని పేర్కొన్నారు. మొదటి విడతలో మొత్తం 10 మండలాల్లో విస్తృతంగా నామినేషన్ దాఖలు అయ్యాయన్నారు. మొత్తంగా 1, 520 వార్డులకు మొత్తం 3,833 నామినేషన్లు దాఖలయ్యాయని..167 సర్పంచ్ స్థానాలకు 1,224 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని కలెక్టర్ వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం.. డిసెంబర్ 11వ తేదీన పోలింగ్ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని వివరించారు.





## హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

**అక్షరటుడే, ఇందూరు :** హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిఖిల్ సాయి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. హిందూ దేవతలపై సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సిగ్గుచేటన్నాడు. రేవంత్ రెడ్డి కూడా హిందూమతంలోనే ఉంటూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఒక మతం కోసం పని చేస్తూ.. ఇతర మతాలను కించ పర్చడం అలవాటైందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపొందగానే కళ్లు నెత్తికెక్కాయని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్

**అక్షరటుడే, ఆర్మూర్:** ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మాక్లూర్ మండలం గుత్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. మొదటి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీచేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు వచ్చిన నామినేషన్ల వివరాలను వెనువెంటనే రోజు వారీగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్‌డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

## పాతనేరస్థులను బైండోవర్ చేయాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పాత నేరస్థులను బైండోవర్ చేయాలని సీపీ సాయిచైతన్య సూచించారు. జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతి పోలింగ్ స్టేషన్‌ను పోలీసు సిబ్బంది తనిఖీ చేసి సౌకర్యాలు ఉన్నాయా లేదా చూడాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, బ్యారక్‌లు తనిఖీ చేశారు. ఇన్వెస్టిగేషన్ కేసుల విచారణలో పక్కా ప్రణాళికతో వెళ్లాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సీపీ సూచించారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని.. రిజిస్ట్రర్‌లో కూడా నమోదు చేయాలని ఆదేశించారు. సైబర్ క్రైం నేరాలు జరుగుతున్నందున యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు గ్రామస్థుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రధాన ప్రదేశాల్లో నిరంతరం అలర్ట్‌గా ఉండాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఆర్నెళ్ల కొకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. ఆయన వెంట జక్రాన్‌పల్లి ఎస్సై మహేశ్, సిబ్బంది ఉన్నారు.







## దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రోటరీ క్లబ్: ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** రోటరీ క్లబ్ దివ్యాంగుల జీవితాల్లో వెలుగులను నింపుతోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జగిత్యాల సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగులకు కృత్రిమ కాలును అమర్చి వారిలో నూతన ఉత్తేజాన్ని కల్పిస్తున్న రోటరీ క్లబ్ ట్రస్ట్‌కు అభినందనలు తెలిపారు. దివ్యాంగుల సాధికారత కోసం రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అద్వితీయమన్నారు. తన ట్రస్టు ద్వారా ఇకపై ప్రతి సంవత్సరం రూ. రెండు లక్షల ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్యాం అగర్వాల్, కార్యదర్శి గోవింద్ జవహర్, ఎన్ఆర్‌సీటీ ఛైర్మన్ అశోక్, కోశాధికారి జుగల్ జాజు, బీజేపీ నాయకులు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నుంచి ముగ్గురి సస్పెన్షన్

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** స్థానిక సంస్థల ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ నుంచి ముగ్గురిని సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పెద్దకొడప్‌గల్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముగ్గురు కాంగ్రెస్ నాయకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించామన్నారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, బస్వరాజ్ దేశాయ్, అంజనీ నాందేవ్ పటేల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించారు. జుక్కల్ శాసనసభ్యుడు తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు పార్టీ నుంచి వారిని తొలగిస్తున్నట్లుగా ప్రకటించారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. కానీ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, అక్కల్ సాయిరెడ్డి, మానిక్ రెడ్డి, సంజీవ్, పందిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు

**అక్షరటుడే, బాల్కొండ :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బాల్కొండలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేపడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ రహదారిపై బుధవారం ఎన్నికల అధికారుల బృందం పలు వాహనాలను తనిఖీ చేసింది. ఎన్నికలను శాంతియుతంగా.. నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తనిఖీలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు వెంట నగదు తీసుకెళ్లే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రూ.50వేలకు పైగా నగదును సరైన ఆధారాలు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. తమ అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించవద్దని పేర్కొన్నారు.

## ఆర్మూర్ కోర్టులో న్యాయవాదుల దినోత్సవం




**అక్షరటుడే, ఆర్మూర్:** భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులు, మొదటి రాష్ట్రపతి, న్యాయవాది బాబు రాజేంద్రప్రసాద్ జన్మదినం, జాతీయ న్యాయవాదుల దినోత్సవాన్ని ఆర్మూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఆర్మూర్ బార్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది లోక భూపతిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్టడి ఆనంద్, న్యాయవాదులు ఎంకే నరేందర్, ఆసూరి గోవింద రాజ స్వామి, చిల్క కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధారి కళాశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రతి ఏడాది మండలంలోని అన్ని గ్రామాల్లో అధ్యాపకులు ఇంటింటికీ తిరుగుతూ అడ్మిషన్లు తీసుకొస్తున్నారు. అయితే కళాశాలలో వసతుల లేమి కారణంగా విద్యార్థులు చదువుపై ఏకాగ్రత చూపలేకపోతున్నారు.

– అక్షరటుడే, గాంధారి




# కళాశాలలో వసతులు కరువు..

- గాంధారి కళాశాలలో అన్నీ అవస్థలే
- బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు
- అధికారులకు విన్నవించినా స్పందించని వైనం

గాంధారి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో బాగానే ఉన్న అడ్మిషన్ల సంఖ్య రానురానూ పడిపోతూ వచ్చింది. దీంతో కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ కళాశాలలో చదివితే కలిగే ఉపయోగాలను వివరించారు. స్కాలర్‌షిప్‌లు, పుస్తకాలు, ఇతర సౌకర్యాలను వివరిస్తూ వచ్చారు.

### కనీస సౌకర్యాలు కరువు

ప్రస్తుతం కళాశాలలో 180 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 11 మంది లెక్చరర్లు, ఒక ప్రిన్సిపల్ విధుల్లో ఉన్నారు. స్థానికంగా ఉన్న కళాశాలలో కనీసం తాగడానికి నీళ్లు లేని పరిస్థితి నెలకొందని విద్యార్థులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా బాత్రూంలు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో పడ్డారు. కళాశాలలో ఇతర సమస్యలన్నింటిపై ఇటీవల జూనియర్ కళాశాల కమిటీ సభ్యులు, ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

### రవాణా సౌకర్యం లేక..

కళాశాల ఊరి బయట ఉండడంతో దాదాపు మూడు కిలోమీటర్లు పైగా విద్యార్థులు కాలినడకతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాకపోకలకు బస్సు సౌకర్యం కూడా లేదు. దీంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్మిషన్లు అయ్యేంత వరకు ఒకలాగా ప్రవర్తించిన అధ్యాపకులు.. అడ్మిషన్లు పూర్తయ్యాక పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

### బస్సు డిపో మేనేజర్‌కు విన్నవించాం..

రవాణా సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్న విషయం వాస్తవమే. ఈ విషయంపై బస్సు కోసం కామారెడ్డి డిపో మేనేజర్‌తో మాట్లాడాం. ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం. బస్సులు సరిపోవడం లేదని ఒకవేళ కొత్త బస్సులు వచ్చిన సందర్భంలో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే తాత్కాలిక బస్సు సౌకర్యం కల్పిస్తామని అధికారులు పేర్కొన్నారు.

– గడ్డం గంగారాం , ప్రిన్సిపాల్

## సీఎం రేవంత్‌రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సీఎం రేవంత్‌రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవతలు, హిందువుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా మాట్లాడారన్నారు. ఆయన కూడా ఒక హిందువు అని మరిచిపోతున్నారని ఇలాంటి మాటలను మాట్లాడడానికి సిగ్గు ఉండాలని అసహనం వ్యక్తం చేశారు. కుల రాజకీయాలు చేసే కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని జాగ్రత్తగా మాట్లాడాలని వారు హితవు పలికారు. రాబోయే రోజుల్లో ప్రజలు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, నాయకులు బాలకిషన్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ పట్టణ అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షులు కాశీనాథ్, సత్యం, సీనియర్ నాయకులు బాలరాజు, మల్లయ్య, యువ నాయకులు శివ, పులి రమేష్, హరీనాథ్, దళిత మోర్చా పండరి, ఐటీసెల్ గజానన్ పాల్గొన్నారు.



## పెళ్లి కాకుండానే ప్రెగ్నెంట్..

## అబార్షన్ చేసిన ప్రైవేట్ వైద్యుడు..?

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో గర్భ విచ్ఛిత్తి ఘటనలు ఆగడం లేదు. తాజాగా పట్టణంలో మరో అబార్షన్ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తాడ్వాయి మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో ఆ అమ్మాయి గర్భం దాల్చింది. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో ఓ ప్రైవేట్ వైద్యుడిని ఆశ్రయించారు. అమ్మాయి గర్భం తొలగించేందుకు సదరు వైద్యుడితో రూ.70 వేలకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఒప్పందంలో భాగంగా రూ.50 వేలు చెల్లించగా సదరు వైద్యుడు అబార్షన్ చేసినట్లు తెలిసింది. మరొక రూ.20 వేలు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదు. ఈ విషయం ఇప్పుడు బయటకు పొక్కడంతో మరోసారి గుట్టుగా అబార్షన్లు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది.

## న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి: రఘునాథ్

**అక్షరటుడే, ఇందూరు:** న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఫార్మర్ తెలంగాణ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.రఘునాథ్ అన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లా కోర్టును బుధవారం సందర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయరెడ్డి, బీఆర్.మాణిక్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ముందు వరుసలో నిలిచి బాధితుల పక్షాన పోరాడేది న్యాయవాదులేనన్నారు. కానీ అలాంటి న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం తేవడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. తాను గెలిచిన తర్వాత న్యాయవాదుల రక్షణ చట్టం తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. మహిళలకు బార్ కౌన్సిల్‌లో రాజ్యాంగబద్ధంగా తగిన అవకాశాలు అందడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా మహిళలకు సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.




## కామారెడ్డిలో కత్తిపోట్ల కలకలం

**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి శివారులో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వర్ పల్లి శివారులో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్ పల్లి డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉండే యువకుడు సుతారి రాజశేఖర్(30)తో స్థానికంగా నివాసముండే గంగని ప్రవీణ్ అలియాస్ చింటూ అనే మరో యువకుడు మద్యం తాగాడు. అనంతరం వీరి మధ్య గొడవ జరిగి అదికాస్తా కత్తిపోట్లకు దారి తీసింది. సుతారి రాజశేఖర్‌పై గంగని ప్రవీణ్ అలియాస్ చింటూ కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. కత్తిపోట్లతో రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్పందించిన స్థానికులు వెంటనే రాజశేఖర్‌ను చికిత్స నిమిత్తం ముందుగా జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి నిజామాబాద్ జీజీహెచ్ కు తరలించారు. సంఘటనా స్థలాన్ని కామారెడ్డి రూరల్ సీఐ రామన్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పీవీఆర్ బెదిరింపులకు భయపడేది లేదు

**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి (పీవీఆర్) బెదిరింపులకు తాను భయపడనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. పీ అంటే పైసా.. వీ అంటే వసూల్.. ఆర్ అంటే రెడ్డి అని ఆయన ఎద్దేవా చేశారు. పీవీఆర్ క్రైం నంబర్.2 పేరుతో ఆయన బుధవారం మున్సిపల్ ఆఫీస్‌ను సందర్శించారు. అక్కడ వాయిస్ రికార్డ్ సీసీ కెమెరాల ఏర్పాటును చూసి మండిపడ్డారు. ఆర్మూర్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను ఏర్పాటు చేసిన జనతా గ్యారేజ్ కార్యక్రమానికి పలువురు ఈ పీవీఆర్ అవినీతిపై ఫిర్యాదులు చేశారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పీవీఆర్ కొత్త అవినీతికి తెరలేపారని ఆయన ఆరోపించారు. తనను ఉద్దేశించి వినయ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జీవన్‌రెడ్డి భగ్గుమన్నారు. ‘నా అంతు చూస్తా’ అని పీవీఆర్ అన్నారని.. తాను మున్సిపల్ కార్యాలయంలోనే ఉంటానని.. దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. సమాచార హక్కు చట్టం ప్రకారం తెప్పించిన అన్ని ఆధారాలతో తాను పీవీఆర్‌పై నిర్దిష్టమైన ఆరోపణలు చేశానన్నారు. వాటికి పీవీఆర్ సూటిగా జవాబు చెప్పకుండా నాపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు పూజ నరేందర్, చక్రు, పోల సుధాకర్, రాజేశ్వర్ రెడ్డి, సుంకరి రవి, శ్యాం, పృథ్వీ, మీర శ్రావణ్, మహేష్ ఉన్నారు.



## మూడో విడతలో జోరుగా నామినేషన్లు..

**అక్షరటుడే, ఆర్మూర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో మూడో విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. 162 సర్పంచ్ స్థానాలకు, 1,620 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆర్మూర్ మండలం, డొంకేశ్వర్, ఆలూర్, నందిపేట్ మండలాల్లో సందడి నెలకొంది. మాక్లూర్ మండలం గుత్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోవింద్‌పేట్‌లో నామినేషన్ కేంద్రాన్ని సీపీ సాయిచైతన్య తనిఖీ చేశారు. మాక్లూరు మండలం సింగంపల్లి తండా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ మొత్తంగా ఏకగ్రీవం అయ్యాయి. సర్పంచ్‌గా జాదో శాంతాబాయి సవాయి రామ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు మెంబర్లను గ్రామస్థులు పూలమాలతో సన్మానించారు.



## రేపు గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన



**అక్షరటుడే, కోటగిరి:** రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలో బుధవారం మరమ్మతుల నేపథ్యంలో గ్రామ దేవతల పాత విగ్రహాలను తొలగించారు. ఈ నేపథ్యంలో గురువారం కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. దీంట్లో భాగంగా బుధవారం విగ్రహాలు ప్రతిష్ఠించే ప్రాంతానికి మహిళలు మంగళహారతులతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని.. గ్రామస్థులు తరలిరావాలని వారు కోరారు.




## ఎల్లారెడ్డిలో దివ్యాంగులకు క్రీడలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భవిత సెంటర్‌లో పిల్లలకు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడలను ఎంఈవో రాజులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమగ్రశిక్ష ద్వారా అందుతున్న సేవల, విజయవంతమైన దివ్యాంగుల గురించి వివరించారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వాలు ఉపకరణాల పంపిణీ, వివిధ రకాల వైకల్యాల గురించి వివరించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు తల్లిదండ్రుల సమక్షంలో ఎంపీడీవో తాహేరా బేగం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అరుణ్, ఐఈఆర్‌పీ వెంకటేశం, సీజీవీ పద్మ తదితరులు పాల్గొన్నారు.




## పీహెచ్‌డీ పట్టా అందుకున్న బాన్సువాడ వాసి

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామానికి చెందిన మంగళి రఘు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ పారిటీ పర్యవేక్షణలో ‘కొత్తగా ఏర్పడిన తెలంగాణలో తీర్థయాత్ర పర్యాటకం – తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు మరియు తరువాత తులనాత్మక అధ్యయనం’ అంశంపై ఆయన పరిశోధన పూర్తి చేశారు. దీనిని పరిశీలించిన విశ్వవిద్యాలయ అధికారులు రఘుకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. గ్రామీణ పరిస్థితుల్లో పెరిగిన రఘు, కోనాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పూర్తి చేసి, బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ పూర్తి చేశారు. ఓయూ పీజీ కాలేజీ నుంచి పీజీ పూర్తి చేసి, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పరిశోధనకు ప్రవేశం పొందారు. తన పరిశోధనలో భాగంగా రఘు ప్రచురించిన పలు పరిశోధనా పత్రాలు వివిధ ప్రసిద్ధ జర్నల్స్‌లో రావడం విశేషం. ప్రస్తుతం గాంధారి మండలంలోని గండివేట్ తండాలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గురువులు, గైడ్ అరుణ పారిటీ, కుటుంబ సభ్యులు, మిత్రులు, సహోద్యోగులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.